# 18 నెలలైనా కేసీఆర్‌పై ఏడుపెందుకు?

- కేసీఆర్‌ను తూలనాడటం ఏం సంస్కారం
- ఆలేరు సభలో రేవంత్ తప్పుడు మాటలు
- ఆయన పాపాలకు ప్రజలే శిక్ష విధిస్తారు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్ జూన్ 6 (నమస్తేతెలంగాణ): 'ముఖ్యమంత్రిగా రేవంత్ అధికారం చేపట్టి 18 నెలలైనా మాజీ సీఎం కేసీఆర్‌పై ఇంకా ఏడుపెందుకు? 70 ఏండ్ల వయసులో ఉన్న పెద్దమనిషి కాలుజారి గాయపడితే తూలనాడటం.. దేవుడు శిక్షించాడని అనడం ఏం సంస్కారం?' అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. హామీల అమలు చేతగాక, చెప్పుకునేందుకు ఏమీలేకే ఆలేరు సభలో దుర్భాషలాడారని శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రేవంత్ సీఎం కుర్చీలో ఆయన కూర్చున్నా.. బజారు భాష పోవడం లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు భయపడ్డాడని అసందర్భ ప్రేలాపనలు పేలడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కేసీఆర్ విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని అడిగారు తప్పితే రాలేనని చెప్పలేదనే విషయాన్ని గుర్తుచేశారు. ఈ రోజు యాదగిరిగుట్ట సాక్షిగా ఆలేరు సభలో పాపాలు, శిక్ష అంటూ రేవంత్ నిస్సిగ్గుగా తప్పుడు మాటలు మాట్లాడారని తూర్పారబట్టారు. 'పార్లమెంట్ ఎన్నికలప్పుడు రైతు రుణమాఫీ చేస్తానని అదే యాదగిరిగుట్టపై ఒట్టేసి మాట తప్పితివి.. మరీ నీకు దేవుడు ఏం శిక్ష వేయాలి' అని ప్రశ్నించారు. అధికారం మత్తులో వీర్రవీగుతున్న రేవంత్ పాపాలు పండే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఇప్పటికైనా గల్లీ లీడర్‌లా కాకుండా హుందాగా నడుచుకోవాలని ప్రశాంత్ హితవు పలికారు.

## అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని నడుపలేరు

**బీఆర్‌ఎస్ కార్యకర్తల అక్రమ అరెస్టులపై తుంగబాలు ఫైర్**



హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని ఎక్కువ రోజులు నడపలేరని బీఆర్‌ఎస్‌వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు అన్నారు. ఆరు గ్యారెంటీలపై యాదాద్రి జిల్లా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకుంటారనే భయంతో అక్రమంగా అరెస్టులు చేయడాన్ని శుక్రవారం ఆయన ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా.. అక్రమ అరెస్టులతో ఆగమాగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ఒంటెత్తు పోకడలతో రాష్ట్రానికి తీవ్రనష్టం కలుగుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### శంకుస్థాపన చేయడంపై నిర్వాసితుల నిరసన



*గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ప్రకటించకుండానే శంకుస్థాపన చేయడాన్ని నిరసిస్తూ భూనిర్వాసితులు శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. –తుర్కపల్లి*

# కాళేశ్వరం కాదంటే గంధమల్లకు నీళ్లెట్ల?

- ఏపీ ప్రాజెక్టులు కడుతుంటే కళ్లప్పగించి చూస్తున్నారు
- బీజేపీ ఎంపీలు కండ్లు తెరవాలి
- చంద్రబాబుకు సర్కారు దాసోహం
- అబద్ధాలకు సీఎం రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్
- గోబెల్స్ ఉంటే ఉత్తమ్‌ను చూసి ఉరేసుకునేవాడు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు



*సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్*

దుబ్బాక, జూన్ 6 (నమస్తే తెలంగాణ): గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం ప్లాన్ చేస్తుంటే తెలంగాణ బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు మౌనం వహించడంలో ఆంతర్యమేమిటని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దుబ్బాకలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అపెక్స్ కమిటీ, అంతర్రాష్ట్ర అనుమతి, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. చంద్రబాబును ఎదురించే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టుకు వెళ్లడం లేదని, ప్రధానిని కూడా ప్రశ్నించడం లేదని మండిపడ్డారు. ఏపీ నీటి దోపిడీని అడ్డుకోవాల్సిన కేఆర్‌ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు ఇకనైనా కండ్లు తెరవాలని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని కోరారు. 400 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలిస్తుంటే ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం, అటు కేంద్ర మంత్రులు గుడ్లప్పగించి చూస్తున్నారని విమర్శించారు. బనకచర్లతో గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ పూర్తయితే రోజుకు 90 వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారని వాపోయారు.

### చేతగాని తనంతోనే ఏపీ ప్రాజెక్టులు

కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం వల్లే ఏపీ అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్నదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కండ్లు తెరిచి అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని, జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేద్దామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టుకు వెళుతుందని తెలిపారు. నీతి ఆయోగ్‌లో సీఎం రేవంత్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 'కృష్ణానదిలో న్యాయమైన వాటా కిందికి వదిలింది మీరు. గోదావరి–బనకచర్ల కడుతుంటే చేతులు కట్టుకుని చూస్తున్నది మీరు.శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే దానిని అపకుండా చూస్తున్నది మీరు కాదా?' అని ప్రశ్నించారు. గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, దీనిపై ఉత్తమ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ లైనింగ్ పనులు ఆపేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ చేతకానితనంతోనే పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని చెప్పారు. కేసీఆర్ కొట్లాడి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్–3 సాధించారని హరీశ్‌రావు గుర్తుచేశారు.

> ఉద్యోగులకు పీఆర్సీ కోసం మూడు కమిటీలు వేసి కాలయాపన చేశారు. దేశంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఉద్యోగులకు 73 శాతం పీఆర్సీ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే. బీఆర్‌ఎస్ హయాంలో పంచాయతీలకు ఉత్తమ అవార్డులు వస్తే, కాంగ్రెస్ హయాంలో అప్పులు మిగిలాయి.
> –హరీశ్‌రావు

### అబద్ధాల్లో రేవంత్‌ను మించిన ఉత్తమ్

రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అయితే, మంత్రి ఉత్తమ్ ఆయనను మించిపోయారని హరీశ్ ఎద్దేవా చేశారు. గోబెల్స్ అనేవాడు ఉంటే ఉత్తమ్ అబద్ధాలు చూసి ఉరేసుకుని ఉండేవాడన్నారు.

### క్యాబినెట్ నిర్ణయాలతో నిరాశ

మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 500 రోజులు గడిచినా అమలు చేయలేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గోబెల్స్ ప్రచారం తప్ప ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. ఒక్క డీఏ మంజూరు చేస్తామని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం బాధాకరమని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, దుబ్బాక మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గంధమల్ల ప్రాజెక్టు కాళేశ్వరంలో అంతర్భాగం

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన గంధమల్ల ప్రాజెక్టుకు రేవంత్ కొబ్బరికాయ ఎలా కొడుతున్నారో చెప్పాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, రంగనాయక్ సాగర్, మల్లన్న సాగర్, గంధమల్ల ఇవన్నీ కాళేశ్వరంలో అంతర్భాగం కాదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జలాలు ఎలా వస్తాయని నిలదీశారు. దీనినిబట్టి కాళేశ్వరంపై కాంగ్రెస్ ఇన్నాళ్లూ చేసింది తప్పుడు ప్రచారమేనని తేలిపోయిందన్నారు. గంధమల్లకు, మూసీకి వచ్చేది కాళేశ్వరం నీళ్లేనని, మూసీలో గోదావరి నీళ్లు ఎలా పోస్తారని రేవంత్‌ను ప్రశ్నించారు.

### నేడు 'కాళేశ్వరం'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన 'కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం–వాస్తవాలు' అనే అంశంపై వివరిస్తారు.

## రేవంత్ పాలనలో మరో 3,000 కోట్ల అప్పు

- ఆర్బీఐకి సెక్యూరిటీ బాండ్లను పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- 10న వేలం ద్వారా రుణం తీసుకునేందుకు ఏర్పాట్లు

హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం అప్పుల కోసం మాత్రం అన్ని మార్గాలను అన్వేషిస్తున్నది. భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి మరో రూ.3,000 కోట్ల రుణం తీసుకునేందుకు చర్యలు చేపట్టింది. ఈ నెల 10న నిర్వహించే బహిరంగ వేలంలో అప్పు తీసుకునేందుకు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. 30 ఏండ్ల కాలానికి 1,000 కోట్లు, 31 ఏండ్ల కాలానికి మరో రూ.1,000 కోట్లు, 32 ఏండ్ల కాలానికి ఇంకో రూ.1,000కోట్లు తీసుకుంటామని రేవంత్ ప్రభుత్వం సెక్యూరిటీ బాండ్లు పెట్టినట్టు శుక్రవారం ఆర్బీఐ వెల్లడించింది. 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణం కోసం ఆర్బీఐకి రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలు పంపించింది. ఏప్రిల్‌లో రూ.4,400 కోట్లు, మేలో 4,500 కోట్లు, జూన్ 3న రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.10,400 కోట్లు సేకరించింది. ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సమీకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

## రేవంత్ సర్కారు గంటకు 13 కోట్ల అప్పు!

**బీజేఎల్పీ నేత ఏలేటి విమర్శ**



హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు రోజుకు రూ.320 కోట్లు, గంటకు రూ.13 కోట్ల చొప్పున అప్పు చేస్తున్నదని, అయినా పెండింగ్ బకాయిలు విడుదల చేయడంలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలేదని ధ్వజమెత్తారు. ఏడాదిన్నర పాలనలో సీఎం రేవంత్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

# మెజార్టీ ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదు

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పనితీరును బేరీజు వేసుకోవాలి • టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పై సొంత పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని, పార్టీ అధికారంలోకి వచ్చినా కార్యకర్తలు నిరాశగా ఉన్నారని మెజార్టీ ఎమ్మెల్యేల పనితీరు ఏమాత్రం బాగోలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఎమ్మెల్యేల తీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగైతే కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కష్టమేనన్న భావనను వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ప్రజలు సంతృప్తికరంగాలేరని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలంతా ఆగ్రహంగా ఉన్నారని మీడియాలో కథనాలు వస్తుండటం, ఎమ్మెల్యేలు, మంత్రులు కమీషన్ల కోసమే పనిచేస్తున్నారని సొంత పార్టీ నేతల నుంచే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినప్పటికీ ఉత్సాహపూరిత వాతావరణం కనిపించడంలేదని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోవాల్సిన అవసరం ఉన్నదని హితవు పలికారు. పనితీరును పునఃసమీక్షించుకోవాలని, ఏం చేస్తున్నామన్నది బేరీజు వేసుకోవాలని సూచించారు. జూన్ చివరి నాటికి టీపీసీసీ కార్యవర్గ నియామకం, మంత్రి వర్గ విస్తరణ పూర్తయ్యే అవకాశమున్నదని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు.

## బనకచర్లపై కేంద్రమంత్రులు స్పందించాలి

- తెలంగాణ హక్కులను కాపాడాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జూన్6 (నమస్తే తెలంగాణ): గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తెలంగాణ బీజేపీ నేతలు స్పందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ జల హక్కులను కాపాడాలని వారిని కోరారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఏపీ ప్రభుత్వం ట్రిబ్యునల్ అవార్డులకు విరుద్ధంగా గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నదని విమర్శించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలను తెలుపుతూ కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసిందని వెల్లడించారు. ఏపీ ప్రభుత్వం మాత్రం దూకుడుగా ముందుకుపోతున్నదని, కేంద్రం సైతం సహకరిస్తున్నట్టుగా ఉన్నదని అనుమానం వ్యక్తంచేశారు. అవార్డులకు, చట్టాలకు వ్యతిరేక చర్యలను కేంద్రం నివారిస్తుందని తాము ఇప్పటికీ విశ్వసిస్తున్నామని, అలాకాకుండా రాష్ట్ర జలహక్కుల రక్షణ కోసం తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

## పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు

**పేదలు నివసిస్తున్న చోటే జీ+3 నిర్మాణం: పొంగులేటి**



హైదరాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిందని, ఇక పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు నిర్మిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్ష తర్వాత మంత్రి మాట్లాడుతూ పట్టణాల్లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలు అక్కడే ఉండటానికి ఇష్టపడుతున్నారని, నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడంలేదని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్ తదితర నగరాల్లో జీ+3 పద్ధతిలో ఇండ్లను నిర్మిస్తామని చెప్పారు.

# పదేండ్లు సమయమిస్తే ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేస్త!

- కేసీఆర్‌ను పడగొట్టడమే నా లక్ష్యం.. అది పూర్తయ్యింది
- ఎవరు అడ్డం పడినా మూసీనది ప్రక్షాళన చేసి తీరుతా
- తిరుమలాపూర్ సభలో సీఎం



హైదరాబాద్, జూన్ 6(నమస్తే తెలంగాణ): తనను పదేండ్లు ఆశీర్వదిస్తే రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చి ప్రపంచానికే ఆదర్శంగా నిలబెడతానని, బెంగళూరు, ముంబై, ఢిల్లీతో కాకుండా న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి నగరాలతో పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. కేసీఆర్ ప్రభుత్వం తనను అరెస్ట్ (ఓటుకు నోటు కేసులో) చేసినప్పుడే ప్రతినబూనానని, ఎట్లైనా ఆయనను పడగొడతనని చెప్పానని, చెప్పినట్టే కేసీఆర్‌ను పడగొట్టానని, ఆయన కుర్చీలో కూర్చోవాలన్న తన లక్ష్యం నెరవేరిందన్నారు. దేవుడిని వివాదాల్లోకి, రాజకీయాల్లోకి లాగదల్చుకోలేదంటూనే కేసీఆర్‌పై అక్కసు వెళ్లగక్కారు. లక్ష్మీనరసింహస్వామి వద్ద అపచారం జరగడంతోనే కేసీఆర్ కాలు విరిగినట్టు పరోక్షంగా వ్యాఖ్యానించారు. టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట ఆలయానికి వైటీడీ(యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్‌బోర్డు) ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తిచేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. గుజరాత్‌లో సబర్మతి, యూపీలో గంగానదిని ప్రక్షాళన చేసుకున్నారని, కానీ తాము మూసీ ప్రక్షాళన చేద్దామంటే బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అడ్డుపడుతున్నారని రేవంత్ విమర్శించారు. ఎవరు అడ్డం వచ్చినా మూసీని ప్రక్షాళన చేసి తీరుతామని తేల్చి చెప్పారు.

### రేవంత్ ప్రసంగంపై రాష్ట్ర ప్రజల విస్మయం

తనను కోసినా పైసా లేదని ఇటీవల ఓ సమావేశంలో వ్యాఖ్యానించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రాష్ట్రాన్ని న్యూయార్క్, టోక్యో నగరాలతో పోటీ పడేలా చేస్తాననడంపై ఆలేరు ప్రజలు విస్మయం వ్యక్తంచేశారు. ఆయుటి చినుకులు పడి, కాలం మోకామీద కొచ్చి రైతు భరోసా సాయం కోసం ఎదురు చూస్తుంటే సీఎం టోక్యో, జపాన్ అని చెప్పడంతో రైతులు బిత్తరపోయారు. 18 నెలల పాలనలో చెప్పుకోవడానికి ఏమీ లేకపోవడంతో ఇప్పుడు పిట్టల దొర హామీలు గుప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ కాలు విరగడానికి, దేవుళ్లకు ముడిపెట్టడంపైనా ప్రజలు మండిపడుతున్నారు. రేవంత్ ఎక్కడికి పోతే అక్కడ దేవుళ్లపై ఒట్టు పెట్టి మోసం చేసినందుకే రాష్ట్రానికి అరిష్టం పట్టిందని చెప్తున్నారు.

### మహిళల సంపాదన 'బెల్టు'కే!

'ఒకనాడు ఇంటాయనను బస్సు కిరాయి అడిగే మీరు.. సాయంత్రం బెల్టు షాపునకు పైసలు అడిగే పరిస్థితి తెచ్చిన్నా? లేదా?' అంటూ సీఎం సభలో ప్రశ్నించడంతో మహిళలు ఉలిక్కిపడ్డారు. తాము పొద్దంతా కష్టపడి పనిచేసి కూలి డబ్బులు తెస్తే అవి భర్తల తాగుడుకే సరిపోతాయని అర్థం వచ్చేలా మాట్లాడటం చూసి విస్తుపోయారు. గల్లీకో బెల్టు దుకాణం తానే తెచ్చినట్టు రేవంత్ తన వ్యాఖ్యలతో పరోక్షంగా అంగీకరించారని చెప్తున్నారు.

### నిర్బంధాల మధ్య సీఎం టూర్

యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా దమనకాండ కొనసాగింది. ఎక్కడికక్కడ ఆంక్షలు, అరెస్టులు, నిర్బంధాల నడుమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ముగిసింది.

# కాళేశ్వరంలో అంతర్భాగమే 'గంధమల్ల'

- కేసీఆర్ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన
- బీఆర్‌ఎస్ హయాంలోనే గంధమల్లకు రూపకల్పన
- 2017లో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళికలు
- అప్పట్లోనే పరిపాలనా అనుమతులు మంజూరు
- ఆ తర్వాత సామర్థ్యం 1.41 టీఎంసీలకు తగ్గింపు
- 'బీఆర్‌ఎస్' హయాంలోనే యాదాద్రి మెడికల్ కాలేజీ
- కొలనుపాక, కాల్వలపల్లి బ్రిడ్జిలు కూడా అప్పటివే..
- గతంలో చేసిన శంకుస్థాపనలకు రేవంత్ మళ్లీ భూమిపూజ



యాదాద్రి భువనగిరి, జూన్ 6 (నమస్తే తెలంగాణ): 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుంది రేవంత్ సర్కారు తీరు. బీఆర్‌ఎస్ హయాంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకే మళ్లీ మళ్లీ భూమిపూజ చేస్తూ సీఎం రేవంత్ అభాసుపాలవుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని తుర్కపల్లి మండలం తిరుమలాపూర్‌లో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అందులో గంధమల్ల రిజర్వాయర్ కూడా ఒకటి. బీఆర్‌ఎస్ హయాంలోనే దీనికి ప్రతిపాదనలు వచ్చాయి. దీని ద్వారా సుమారు 50 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని భావించారు. 2017లో 9.8 టీఎంసీలతో ప్రతిపాదనలు పంపించారు. అప్పటి సర్కారు రూ. 800 కోట్లతో పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చింది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా 2,450 క్యూసెక్కుల నీరు గంధమల్లకు చేరేలా ప్రణాళికలు రూపొందించారు. అయితే అక్కడ కరెంట్ స్తంభాలు ఉండటంతో రిజర్వాయర్‌ను కుదించారు. ఆ తర్వాత 2018లో 4.28 టీఎంసీలకు తగ్గించగా, 2019 భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం వివిధ కారణాలతో 2022లో 1.41టీఎంసీలకు తగ్గించి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇదే ప్రతిపాదనకు ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 575.55 కోట్లతో మంజూరు ఉత్తర్వులు జారీచేసింది. గంధమల్ల రిజర్వాయర్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం. కాళేశ్వరం నుంచి మల్లన్నసాగర్‌కు చేరిన నీరు అక్కడి నుంచి పలు ప్యాకేజీలకు చేరుతుంది. ప్యాకేజీ–14లో భాగంగా కొండపోచమ్మ సాగర్‌కు, ప్యాకేజీ–15లో గంధమల్లకు చేరుతుంది. ప్యాకేజీలో–16లో భాగంగా ఇప్పటికే బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చివరి దశకు చేరింది. గంధమల్లకు నీళ్లు రావాలన్నా కాళేశ్వరమే దిక్కు. కానీ, కాళేశ్వరం కూలిందంటూ గతంలో సీఎం, మంత్రులు విమర్శలు చేశారు. ఇప్పుడు అదే కాళేశ్వరం నుంచి గంధమల్లకు నీరు ఎలా తరలిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

### కాల్వలపల్లి, కొలనుపాక బ్రిడ్జీలు సైతం..

ఆలేరు మండలం కొలనుపాకలో హైలెవల్ బ్రిడ్జి, రాజపేట మండలం కాల్వపల్లిలో హైలెవల్ బ్రిడ్జి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయి. ఈ రెండు బ్రిడ్జీలకు గత ఎమ్మెల్యే గొంగిడి సునీత శంకుస్థాపనలు చేశారు. కొలనుపాక బ్రిడ్జికి ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కొత్తగా కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు ఆయన సోషల్ మీడియా ఖాతాల్లో ఇప్పటికీ ఉన్నాయి. ఇప్పుడు తాజాగా మళ్లీ రేవంత్‌తో రెండు బ్రిడ్జిలకు శంకుస్థాపనలు చేయించడం గమనార్హం.

### మెడికల్ కాలేజీ బీఆర్‌ఎస్ హయాంలోనిదే..

తెలంగాణ ఏర్పాటు తర్వాత నాటి బీఆర్‌ఎస్ సర్కారు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు 2023 జూలై 6న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జీవో నంబర్ 85ను విడుదల చేసింది. 100 సీట్ల సామర్థ్యంతో కాలేజీ ఏర్పాటు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని జీవోలో పేర్కొన్నది. ఆ తర్వాత లక్ష్మీనరసింహస్వామి మెడికల్ కాలేజీగా నామకరణం చేశారు. కాలేజీ నిర్మాణానికి రూ.183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఇప్పుడు ఇదే కాలేజీకి రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అయితే కాంగ్రెస్ ఈ కాలేజీని కుదించి జిల్లాకు అన్యాయం చేసింది. ఎంబీబీఎస్ సీట్లను 50కి తగ్గించడమే కాకుండా 300 పడకల దవాఖానను 220 పడకలకు పరిమితం చేసింది.

# సీడబ్ల్యూసీ, మహారాష్ట్ర అభ్యంతరాల వల్లే రీడిజైన్

మొదటిపేజీ తరువాయి...

సాక్షిగా హాజరైన ఈటల రాజేందర్‌ను జస్టిస్ పీసీ ఘోష్ 40 నిమిషాలపాటు ప్రశ్నించారు. ఆర్థిక మంత్రిగా ఎంతకాలం పనిచేశారు? కాళేశ్వరం రీడిజైన్ ఆవశ్యకత, బరాజ్‌ల నిర్మాణం, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు తదితర అంశాలపై మొత్తంగా 19 ప్రశ్నలడిగి వివరాలను ఆరా తీశారు.

**కమిషన్:** మూడు బరాజ్‌లపై ఎవరి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నారు?

**ఈటల:** బరాజ్‌ల నిర్మాణం అనేది టెక్నికల్ కమిటీ చూసుకుంటుంది. దానితో రాజకీయ నాయకులకు సంబంధం లేదు. సాంకేతికపరమైన నిర్ణయాలు మేము తీసుకోలేం. టెక్నికల్ కమిటీ రిపోర్ట్ ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌లను నిర్మించాలని నిర్ణయించాం. ఆ నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించిన తర్వాతే నిర్మాణం జరిగింది.

**కమిషన్:** ప్రాజెక్టును రీడిజైన్ చేయాలని ఎవరు ఆదేశించారు?

**ఈటల:** తుమ్మిడిహెట్టి వద్ద నీటిలభ్యత లేదని కేంద్ర జలసంఘం చెప్పింది. ముంపు నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. బరాజ్‌ను 152 మీటర్ల ఎత్తు వరకు నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదు. 148 మీటర్ల నిర్మాణానికి మాత్రమే ఒప్పుకున్నది. ప్రాజెక్టు ద్వారా అప్పటికి 30 టీఎంసీలతో పట్టణ తాగునీటి అవసరాలు, 10 టీఎంసీలతో గ్రామీణ తాగునీటి అవసరాలు, 15 టీఎంసీలతో పారిశ్రామిక అవసరాలతోపాటు 16.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉన్నది. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్‌ను నిర్మిస్తే అక్కడ తెలంగాణ నీటి అవసరాలను తీర్చలేము. ఆ పక్కనే అభయారణ్యం కూడా ఉండటంతో అధ్యయనం కోసం నాటి సీఎం కేసీఆర్ క్యాబినెట్ సబ్‌కమిటీ వేశారు. హరీశ్‌రావు నేతృత్వంలోని ఆ సబ్‌కమిటీలో నేను, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నాము. ఎక్స్‌పర్ట్ కమిటీ, టెక్నికల్ కమిటీలు కూడా సాధ్యాసాధ్యాల నివేదికలను సమర్పించాయి. వాటితోపాటు, సబ్‌కమిటీ నిర్ణయం మేరకు ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. దానికి మొత్తం క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

**కమిషన్:** డీపీఆర్ కోసం ప్రభుత్వం వ్యాప్కోస్ సంస్థకు 5.97 కోట్లు ఇచ్చిందా?

**ఈటల:** వాప్కోస్‌తో డీపీఆర్ ప్రిపరేషన్, ఇతర స్టడీస్ కోసం 5.9 కోట్లు కేటాయించారు. క్యాబినెట్ ఆమోదం కూడా ఉన్నది.

**కమిషన్:** క్యాబినెట్‌లో డీపీఆర్ అప్రూవల్ జరిగిందా?

**ఈటల:** తొలుత కాళేశ్వరం ప్రాజెక్టును రూ.63 వేల కోట్లతో ప్రతిపాదించారు. ఆ తర్వాత ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి రైతుల నుంచి డిమాండ్లు రావడంతో అది రూ.83 వేల కోట్లకు పెరిగింది. క్యాబినెట్‌లో అన్ని అనుమతులు తీసుకున్నాం.

**కమిషన్:** కాళేశ్వరం కార్పొరేషన్‌ను ఎందుకు ఏర్పాటు చేశారు?

**ఈటెల:** తెలంగాణ అప్పుడే కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. భారీ ప్రాజెక్టుకు ఆ మేరకు నిధులను వెచ్చించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే నిధుల సమీకరణ, రుణాల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఫైనాన్స్ పరిధిలోకి ఆ కార్పొరేషన్ రాదు.

**కమిషన్:** లోన్స్ రీ–పేమెంట్ ఎలా చేయాలనుకున్నారు?

**ఈటల:** కార్పొరేషన్ ద్వారా నిధులను వసూలు చేసి రుణాలు తీర్చాలనుకున్నాం. కానీ నిధులు వసూలు కాలేదు.

**కమిషన్:** ప్రాజెక్టు నిర్మాణ సమయంలో చెల్లింపులు ఆఫ్ బడ్జెట్‌లో జరిగాయా?

**ఈటల:** నిధుల విడుదల అంతా కార్పొరేషన్ ద్వారానే జరిగింది. ఆర్థిక శాఖకు సంబంధం లేదు.

**కమిషన్:** మూడు బ్యారేజీలు అక్కడ కట్టాల్సింది కాదంటే మీరేమంటారు?

**ఈటల:** ఎక్కడ ఏ బ్యారేజీ కట్టాలన్నా అది టెక్నికల్ టీమ్ మాత్రమే చెప్తుంది.

**కమిషన్:** ప్రాజెక్టు నిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ లేదంటే..?

**ఈటల:** అది ఆర్థిక శాఖ కిందికి రాదు. ఇరిగేషన్ శాఖ కిందికి వస్తుంది. ఇరిగేషన్ శాఖకు ప్రత్యేకంగా అకౌంట్, ఆడిట్ విభాగాలు ఉన్నాయి.

### రాజకీయ పబ్బం గడిపితే ఊరుకోం: ఈటల రాజేందర్



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా బయటపెట్టాలని, బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాకాకుండా ప్రాజెక్టు పేరుచెప్పి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తాను ఏ పార్టీలో ఉన్నప్పటికీ విలువలతో కూడిన రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నానని, కణత మీద తుపాకీ పెట్టినా విలువలు పోగొట్టుకోబోనని తెలిపారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా ప్రజలే నిజమైన న్యాయ నిర్ణేతలని, బట్టకాల్చి మీద వేయడం మానేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు.